# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సుస్థిరమైన హరిత ప్రపంచాన్ని నిర్మించేందుకు సమిష్టి కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.**
2. **దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, ఇతర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష -నీట్ 2024 ఫలితాలు విడుదల అయ్యాయి.**
3. **ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతామని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
4. **9వ ఐసీసీ టీ20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా భారత జట్టు తొలి మ్యాచ్ ఈ రోజు ఆడనుంది.**
5. **రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సుస్థిరమైన హరిత ప్రపంచాన్ని నిర్మించేందుకు సమిష్టి కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖడ్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భూమి తల్లిని రక్షించడం ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. వాతావరణ మార్పులు జీవితాలను, జీవనోపాధిని ప్రభావితం చేస్తాయని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సామాజిక మాధ్యమాల వేదికగా రాష్ట్రపతి తెలిపారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మానవులు- ప్రకృతి మధ్య సామరస్యం సుస్థిర జీవనానికి పునాది అని అన్నారు. ప్రకృతితో మమేకమైన జీవితాన్ని గడపడానికి మన నాగరికత మనకు మార్గదర్శకమని తెలిపారు. పర్యావరణ సుస్థిరత సూత్రాలను స్వీకరిస్తామని ప్రతిజ్ఞ చేయాలని, మాతృభూమిని పరిరక్షించేందుకు నిబద్ధతను పునరుద్ఘాటించాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.

--------------------------

దేశ వ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష -నీట్ 2024 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ -ఎన్టీఏ నిన్న విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 23 లక్షల 33 వేల 297 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 13 లక్షల 16 వేల 268 మంది అర్హత సాధించారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 64,931 మంది పరీక్ష రాయగా 43 వేల 858 మంది అర్హులుగా నిలిచారని, అలాగే తెలంగాణలో 77 వేల 849 మందికి గాను 47 వేల 371 మంది అర్హత సాధించారని

అధికారులు తెలిపారు. జాతీయ స్థాయిలో 9.98 లక్షల మంది బాలురు నీట్ రాయగా 5.47 లక్షల మంది, 13.34 లక్షల మంది బాలికలు పరీక్ష రాయగా 7.69 లక్షల మంది అర్హులుగా నిలిచారు. గత నెల 5వ తేదీన దేశవ్యాప్తంగా 571 నగరాలు, పట్టణాలతోపాటు విదేశాల్లో 14 నగరాల్లో నీట్ యూజీ పరీక్షని నిర్వహించారు.

---------------------------

రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి 164 స్థానాల్లో గెలుపొందింది. కూటమిలో భాగంగా 144 శాసనసభ స్థానాల్లో పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో, జనసేన పోటీచేసిన 21 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాలకు గాను 8 స్థానాల్లో విజయం సాధించాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 స్థానాల్లో గెలుపొందింది. అలాగే రాష్ట్రంలోని 25 లోక్ సభ నియోజకవర్గాల్లో తెలుగు దేశం పార్టీ 16 స్థానాలను గెలుచుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాల్లో, భారతీయ జనతా పార్టీ 3 స్థానాల్లో విజయం సాధించగా, జనసేన పార్టీ రెండు స్థానాల్లో విజయం సాధించింది.

---------------------------

ఎన్నికల్లో కూటమికి విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. ప్రజలు గెలవాలి రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నదే కూటమి ధ్యేయమని అన్నారు. పార్టీలు ప్రజారంజకంగా పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారని పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాల్లో విస్పష్టమైన ఆధిక్యత రావడంతో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్‌తో నిన్న సమావేశమయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వచ్చిన చంద్రబాబునాయుడుకి పవన్ కళ్యాణ్ సాదర స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా సమావేశమై.. ప్రభుత్వ ఏర్పాటు, ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ రోజు ఢిల్లీలో జరిగే ఎన్డీయే సమావేశానికి హాజరయ్యేందుకు ఇరువురు నేతలు బయలుదేరి వెళ్ళారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పందించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో పయనిద్దామని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఆకాంక్షించారు.

---------------------------

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 240 స్థానాల్లో విజయం సాధించగా, ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 272 సీట్లను సాధించింది. కాంగ్రెస్ 99 చోట్ల విజయం సాధించింది. కాగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన నేపథ్యంలో భారతీయ

జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మారిషస్, నేపాల్, ఇటలీ, భూటాన్, మాల్దీవులకు చెందిన దేశాధినేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. భారత ప్రజల శ్రేయస్సుకు ఆయన కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామని తెలిపారు.

-----------------------------

సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన పలువురు అభ్యర్థులు తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. ఇందులో భాగంగా వైసిపి తరపున తిరుపతి పార్లమెంట్ సభ్యుడిగా ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతల తెలియజేస్తున్నానని తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి అన్నారు. ఎంపీగా రెండోసారి తనను తిరుపతి ప్రజలు గెలిపించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. గతంలో ఏ విధంగా అయితే తిరుపతి పార్లమెంటు పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణం, తిరుపతి అంతర్జాతీయ రైల్వేస్టేషన్, విమానాశ్రయంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే కూటమి తరపున చిత్తూరు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన డి. ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్డీయే భాగస్వామ్యంతో చిత్తూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పార్లమెంట్ సభ్యునిగా కూటమి తరపున ఎన్నికైన శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ, ప్రజలు మంచి మెజార్టీతో తనను గెలుపించారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానని తెలిపారు.

-----------------------------

విజయవాడ మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో అతిసార ప్రబలిన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు. నిన్న విజయవాడలో సర్వే జరుగుతున్న తీరును ఆమె పరిశీలించి సిబ్బందికి సూచ నలు చేశారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, 11 బృందాలు 627 ఇళ్లకు వెళ్లి 2 వేల 303 మంది ప్రజల ఆరోగ్య స్థితిని తెలుసుకున్నాయని తెలిపారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి శిబిరం వద్ద చికిత్స తీసుకొనే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సురక్షిత మంచినీటిని వినియోగించడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

-----------------------------

నైరుతి ఋతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

-----------------------------

9వ ఐసీసీ టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా భారత జట్టు తొలి మ్యాచ్ ఈరోజు ఆడనుంది. న్యూయార్క్‌లోని నాసావు కౌంటే అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగే మ్యాచ్‌లో భారత జట్టు, ఐర్లాండ్ జట్టుతో పోటీపడనుంది. భారత కాలం ప్రకారం ఈ మ్యాచ్ ఈ రోజు రాత్రి 8 గంటలకు జరుగుతుంది.కాగా నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు నేపాల్ జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించింది.

---------------------------

రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంపట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు, కూటమికి విజయం చేకూర్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని, ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సుపరిపాలన అందిస్తామని, పార్లమెంట్ సభ్యురాలుగా రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

======================